సాక్షి

అన్నమయ్య జిల్లా

గురువారం । 21 । మార్చి । 2024



వైఎస్సార్‌సీపీలోకి వలసలు

గుర్రంకొండ మండలంలోని తరిగొండ, రామాపురం పంచాయతీల పరిధిలో పలువురు టీడీపీ నాయకులు, కుటుంబాల వారు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు (సా॥)	సహర్ శుక్ర (ఉ॥)
రాయచోటి	6.30	5.02
రాజంపేట	6.30	5.00
పీలేరు	6.32	4.57
మదనపల్లె	6.32	5.04

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.200
రెండోరకం	రూ.80	రూ.148



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 30 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	455	460
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 52.320 కిలోలు

న్యూస్‌రీల్

ఉపకార వేతనాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్ : శానిటరీ విభాగ కార్మికుల పిల్లలు ఉపకార వేతనం పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ, సాధికారిక అధికారి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అపరిశుభ్రత వృత్తులు నిర్వహిస్తున్న వారి పిల్లలకు ఉపకార వేతనం మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. అర్హత ఉన్న వారు గ్రామ సచివాలయ/ వార్డు సచివాలయలలోని వెల్ఫేర్/ విద్యా సహాయకులు డాటా ప్రాసెసింగ్ అధికారులను సంప్రదించి ఏప్రిల్ 10వ తేది లోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

26న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 26వ తేది ఉదయం 10.00 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు ముఖ్య కార్యనిర్వహణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీలతో పాటు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

23న కడప ఐటీఐలో క్యాంపస్ సెలక్షన్స్

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐలో ఈనెల 23వ తేదీన క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు కడప ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ కె.రత్నరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జె.వై. సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, టెక్ మహీంద్రా కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఎంపికలకు ఐటీఐ చదువుతున్న, పూర్తయిన విద్యార్థులు, ఇంటర్, డిగ్రీ పూర్తయిన విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపిక చేసుకున్న విద్యార్థులకు 55 రోజుల పాటు శిక్షణ ఇచ్చి ఉద్యోగంలో చేరిన తర్వాత రూ.13 వేలు నుంచి రూ.22 వేలు వరకు చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

ఓట్ ఫ్రం హోం



- 85+ వయోవృద్ధులు, పీడబ్ల్యూడీ ఓటర్లకు అవకాశం
- రాష్ట్రంలో తొలిసారిగా అమలు
- నియోజకవర్గ కేంద్రాల్లోనే ఫెసిలిటేషన్ సెంటర్లు



ప్రతీకాత్మక చిత్రం



కడప సెవెన్‌రోడ్స్ : లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. మే 13న పోలింగ్ జరగనుంది. వేసవి కాలం కావడంతో జిల్లాలో ఎండలు ఇప్పటికే మండిపోతున్నాయి. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో చెప్పాల్సిన పనేలేదు. ఊహించుకుంటేనే భయమేస్తోంది. ఈ పరిస్థితుల్లో అసలే ఓటింగ్ శాతం తక్కువ నమోదయ్యే పట్టణ ప్రాంతాల్లో ఎంతమంది పోలింగ్ రోజున ఓటు వేసేందుకు వెళతారో తెలియదు. వయస్సు, ఆరోగ్యం ఉన్న వారే తటపటాయిస్తుంటే ఇక వృద్ధులు, వికలాంగుల గురించి చెప్పే పని ఉండదు. ఓటింగ్‌లో పాల్గొనాలని వీరిలో ఉత్సాహం ఉన్నప్పటికీ వయస్సు, వైకల్యం ప్రతిబంధకంగా ఉంటోంది. వీరిని పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకెళ్లి ఓటు వేయించడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. అయితే వీరు బాధ పడాల్సిన పని లేకుండా భారత ఎన్నికల సంఘం ఈ దఫా రాష్ట్రంలో కొత్తగా ఓట్ ఫ్రం హోం పద్ధతికి శ్రీకారం చుట్టింది. ఇందువల్ల ఓటింగ్ శాతం పెరగనుందని అధికారులు భావిస్తున్నారు.

- కోవిడ్ ప్యాండమిక్ నేపథ్యంలో 2020లో బీహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇంటి వద్ద నుంచే ఓటు వేసే పద్ధతిని తీసుకు రావాల్సి వచ్చింది. ఆ తర్వాత కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ కండక్ట్ ఆఫ్ ఎలెక్షన్ రూల్స్–1961కి సవరణలు తీసుకొచ్చింది.
- ఓట్ ఫ్రం హోం కార్యక్రమం కింద 85 సంవత్సరాలు పైబడిన వయో వృద్ధులకు, 40 శాతం పైబడి వైకల్యం ఉన్న పీడబ్ల్యూడీ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్లు మంజూరు చేయనున్నారు. వైకల్యం ఉన్న వారు సర్టిఫికెట్ తప్పనిసరిగా సమర్పించాలి. నామినేషన్ల పర్వం ప్రారంభం కావడానికి ముందే అర్హులకు ఫారం–డి ఇళ్ల వద్దకే తీసుకొచ్చి అందజేస్తారు. నోటిఫికేషన్ విడుదలైన ఐదు రోజుల్లో వాటిని భర్తీ చేసి బీఎల్‌ఓలకు సమర్పించాలి. బీఎల్‌ఓలు వాటిని తీసుకెళ్లి సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందజేస్తారు. పోలింగ్ కన్నా ముందే హోం ఓటింగ్ ఉంటుంది. జిల్లా ఎన్నికల అధికారి తేదీని నిర్ణయిస్తారు. అధికారులు పోస్టల్ బ్యాలెట్లను ఇళ్ల వద్దకే తెచ్చి అందజేస్తారు. ఐదుగురు పోలింగ్ సిబ్బంది, వీడియో గ్రాఫర్, పోలీసు రక్షణతో బ్యాలెట్ బాక్సు, కంపార్ట్‌మెంట్ సహా ఇంటి వద్దకు తీసుకొస్తారు.
- వృద్ధులు, వికలాంగులు పోస్టల్ బ్యాలెట్లలో తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు నమోదు చేసి దాన్ని కవరులో ఉంచి బ్యాలెట్ బాక్సులో వేయాల్సి ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేస్తారు.
- అన్నమయ్య జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 14,02,808 మంది ఉన్నారు. వీరిలో పీడబ్ల్యూడీ ఓటర్లు సుమారు 10వేలకు పైగా, 85 ఏళ్లు, అంతకన్నా ఎక్కువ వయస్సున్న ఓటర్లు పదివేల లోపు ఉంటారని అంచనా. వివరాలు తెలియాల్సి ఉంది. వీరిలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ పోస్టల్ బ్యాలెట్లు జారీ చేయాల్సి ఉంటుంది.
- వృద్ధులు, వికలాంగుల్లో కొంతమంది తాము నేరుగా పోలింగ్ కేంద్రాల వద్దకే వచ్చి ఓటుహక్కు వినియోగించుకుంటామనే వారు కూడా ఉండవచ్చు. అది వారి నిర్ణయానికే వదిలేస్తారు. సమగ్రమైన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే అవకాశాన్ని కల్పించడంలో భాగంగా భారత ఎన్నికల సంఘం ఓట్ ఫ్రం హోం కార్యక్రమాన్ని చేపడుతోంది.

నియోజకవర్గ కేంద్రాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లు



ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, అదర్ పోలింగ్ పర్సనల్స్ సుమారు 20 వేలకుపైగా ఉండవచ్చని తెలుస్తోంది. గతంలో నిర్ణయించిన తేదీన అందరూ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లకు వచ్చి పోస్టల్ బ్యాలెట్లు తీసుకుని తమ ఓటు వినియోగించుకునేవారు. ఇందువల్ల సమయం, డబ్బు వృథా అవుతుందని జిల్లాలో ఈ యేడు కొత్తగా ఆయా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లోనే పోలింగ్ సిబ్బందికి ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వీరు కాకుండా ఆర్టీసీ ఉద్యోగులు, ఇతర అత్యవసర విధులు నిర్వర్తించే శాఖలకు చెందిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్లు అందజేస్తారు. అలాగే జైళ్లలో ఉండే రిమాండ్ ఖైదీలకు పోస్టల్ బ్యాలెట్లు అందజేస్తారు. సుమారు 50 వేల పోస్టల్ బ్యాలెట్ల అవసరమవుతుందని అధికారుల అంచనా.

పది పరీక్షలు సజావుగా జరగాలి

- కాపీయింగ్‌ను పూర్తిగా అరికట్టాలి
- కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డీఈఓ

లక్కిరెడ్డిపల్లి: జిల్లాలో పదోతరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా జరగాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం లక్కిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షా కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పరీక్షా కేంద్రాల వద్ద కొంతమంది బయట వ్యక్తులు గుంపుగా ఉండటంపై విద్యాశాఖ, పోలీస్ అధికారులపై కలెక్టర్ అసంతృప్తి వెలిబుచ్చారు. బయట వ్యక్తులందరినీ పరీక్షా కేంద్రాలకు దూరంగా పంపించాలని, పరీక్ష మొదలైన తర్వాత కేంద్రాల్లోకి ఇతరులు ఎవరినీ అనుమతించరాదన్నారు. కట్టుదిట్టంగా పరీక్షలను నిర్వహించాలని డీఈఓను ఆదేశించారు. కేంద్రాలలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న మౌళిక సదుపాయాలపై కలెక్టర్ ఆరా తీశారు. కల్పించిన వసతులను ఆయన పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పదోతరగతి పరీక్షలు కట్టుదిట్టంగా జరిపేలా చీఫ్ సూపరిటెండెన్స్, ఫ్లైయింగ్, సిటింగ్ స్క్వాడ్ అధికారులు కృషి చేయాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలను నోఫోన్ జోన్‌గా ప్రకటించడం జరిగిందని, ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలని పోలీస్, విద్యాశాఖ అధికారులకు సూచించారు. డీఈఓ శివప్రకాష్ రెడ్డి, చీఫ్ సూపరిటెండెంట్లు, పోలీస్ అధికారులు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

- సి విజిల్ యాప్‌లో వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి
- జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్



ఎన్నికల నియమావళి వివరిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి:ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ రాజకీయ పార్టీ నాయకులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సాధారణ ఎన్నికలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ప్రతి ఒక్కరూ ఎంసీసీ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ఇతర ప్రార్థనా స్థలాల్లో ఎన్నికల ప్రచారం చేయరాదన్నారు. ఎన్నికల సంఘం రూపొందించి సి విజిల్, నో యువర్ కాండిడేట్, ఓటర్ హెల్ప్‌లైన్ వంటి యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చుని, వాటి ద్వారా చాలా సమాచారాన్ని పొందవచ్చన్నారు. రిటర్నింగ్ అధికారులు పోలీస్ చెక్ పోస్టులను తరచూ విజిట్ చేయాలన్నారు. నామినేషన్లు స్వీకరణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఏఎస్పీ రాజ్ కమల్, డీఆర్‌ఓ పాల్గొన్నారు.

బస్సుయాత్రలో అందరూ భాగస్వాములు కావాలి

ఎంపీ, ఎమ్మెల్యేల సమావేశంలో రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ జిల్లాలో ఈనెల 27న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించబోయే బస్సుయాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్లు కె. సురేష్ బాబు, పి. రామసుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ చైర్మెన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, డీసీ గోవిందరెడ్డి, ఎంపీ రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, పి. రవీంద్రనాథ్‌రెడ్డి, డా. దాసరి సుధ, ఆర్టీసీ చైర్మెన్ ఏ మల్లికార్జునరెడ్డిలతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థులు సచివాలయాలు, మండలం, మున్సిపాలిటీ స్థాయిలో పరిశీలకులను నియమించుకోవాలన్నారు. ఆ జాబితాను పార్టీ అధ్యక్షులకు అందజేయాలన్నారు. దివ్యాంగులకు, ఎన్నికల్లో పాల్గొంటున్న వారికి బ్యాలెట్ ఓట్ల కోసం దరఖాస్తు చేయాలన్నారు. ఈనెల 27వ తేది కడప పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి ప్రొద్దుటూరులో 'మేమంతా సిద్ధం' సభ జరుగనుందని ఈ సభను విజయవంతం చేయడానికి అందరూ కృషి చేయాలన్నారు. లక్షా యాభైవేల మందికి తగ్గకుండా జన సమీకరణ చేయాలని సూచించారు. సభ నిర్వహించే ప్రదేశాన్ని గుర్తించి, అందుకు సంబంధించిన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. 7 నియోజకవర్గాల నుంచి కనీసం 300 బస్సుల్లో జన సమీకరణ చేయాలన్నారు.

- డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ ఈనెల 27వ తేది నుంచి బస్సుయాత్ర సభలు జరుగనున్నాయని, వీటిని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.
- కడప, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గాల రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబు మాట్లాడుతూ ఈనెల 27వ తేది సాయంత్రం ప్రొద్దుటూరులో సభ నిర్వహించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కడే బస చేస్తారన్నారు. మరుసటి రోజు నంద్యాల సభకు బయలుదేరి వెళ్తారన్నారు.
- నంద్యాల, కర్నూలు పార్లమెంటు నియోజకవర్గాల రీజనల్ కో ఆర్డినేటర్ పి. రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ సిద్ధం సభలను బ్రహ్మాండంగా విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు.
- ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. సుధాకర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఏపీ సోషల్‌వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్ కుమార్, జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జి కె. నాగేంద్రారెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ఇ. సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కడప, అన్నమయ్య 'సిద్ధం' సభల పోస్టర్లు ఆవిష్కరణ

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కడప జిల్లా, అన్నమయ్య జిల్లాల 'సిద్ధం' సభల పోస్టర్లను రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. బుధవారం స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్లు కె. సురేష్ బాబు, పి.రామసుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా పార్టీ అధ్యక్షులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ ఛైర్మెన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్టీసీ ఛైర్మెన్ ఏ. మల్లికార్జునరెడ్డిలతో కలిసి ఈ పోస్టర్లను ఆవిష్కరించారు. బస్సుయాత్ర సభల విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్‌వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర సభా స్థలి పరిశీలన



సభ స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రోగ్రాం కన్వీనర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ ఈనెల 27 నుంచి ఎన్నిల ప్రచారంలో భాగంగా బస్సు యాత్రను ప్రారంభించనున్నారు. ఇడుపులపాయలో ప్రారంభించిన అనంతరం సాయంత్రం 4 గంటలకు ప్రొద్దుటూరులో తొలి బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నారు. బహిరంగ సభకు సంబంధించిన సభ స్థలిని ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంపై ప్రోగ్రాం కన్వీనర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం ప్రొద్దుటూరుకు వచ్చారు. బొల్లవరం వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలోని రింగ్ రోడ్డు వద్ద వేదికను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సభా స్థలం ఇక్కడ అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితో చర్చించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిశీలకుడు మలికిరెడ్డి హనుమంతురెడ్డి పాల్గొన్నారు.

శ్రీ వీరభద్రస్వామి హుండీ సొమ్ము లెక్కింపు

చాపాడు : ముఖ్య పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన ఆవరణలో బుధవారం జరిగిన హుండీల సొమ్ము లెక్కింపులో వీరభద్రస్వామికి రూ.14.07లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. ఆలయ చైర్మన్ జీవై వెంకటసుబ్బారెడ్డి(ఉదయ్), సర్పంచ్ కిషోర్‌కుమార్‌రెడ్డి, దేవదాయశాఖ పరిశీలకులు మారుతి ప్రసాద్ పర్యవేక్షణలో శాశ్వత హుండీల ఆదాయం లెక్కింపు చేపట్టారు. హుండీల ద్వారా రూ.14,07,724లు ఆదాయం వచ్చింది. గతేడాది 7 నెలలకు రూ.12,14,430లు రాగా, ఈ ఏడాది గతేడాది కంటే ఆదాయం ఎక్కువగా వచ్చింది. హుండీల ద్వారా వచ్చిన నగదును ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు ఈఓ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కురబలకోట మండలం అంగళ్లుకు చెందిన మస్తాన్(33) స్థానికంగా సెల్‌షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం కుటుంబ సమస్యలతో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదేవిధంగా ములకలచెరువు మండలం ఉంగరాలపల్లెకు చెందిన వెంకటేష్ భార్య శ్రీకళ(23) కుటుంబ సమస్యలతో విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వీరు ఆరునెలల క్రితమే ప్రేమవివాహం చేసుకున్నారు. ఇంతలోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితులను కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రులకు తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

పురుగుల మందు తాగి దంపతులు..

బి.కొత్తకోట : బి.కొత్తకోటలో దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసుల కథనం మేరకు.. బి కొత్తకోట రంగసముద్రం రోడ్డులో కాపురం ఉంటున్న దంపతులు బాలాజీ(35) అశ్విని(27) పెళ్లి జరిగి 9 సంవత్సరాలు అయినప్పటికీ పిల్లలు కలగలేదు. దీంతో ఇద్దరూ బుధవారం మధ్యాహ్నం గొడవ పడ్డారు. మనస్తాపం చెందిన అశ్విని ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. భర్త బాలాజీ వెంటనే ఆమె దగ్గర ఉన్న పురుగుల మందు డబ్బా తీసుకొని తానూ తాగాడు. గమనించిన కుటుంబీకులు బాధితులను మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

భువనేశ్వరి పరామర్శ



రెడ్డెమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం


గాలివీడు : మండల పరిధిలోని గొట్టివీడు గ్రామం నగిరికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ ప్రభాకర్‌నాయుడు కుటుంబాన్ని మాజీ సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి బుధవారం పరామర్శించారు. ఇటీవల చంద్రబాబు స్కిల్ స్కాంలో జైలుకు వెళ్లినప్పుడు ప్రభాకర్‌నాయుడు సతీమణి రెడ్డెమ్మ మృతి చెందింది. ఈ క్రమంలో బుధవారం భువనేశ్వరి రెడ్డెమ్మ స్వగృహానికి వెళ్లి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ధైర్యమిచ్చారు. ఆమె వెంట రాయచోటి టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగికి తీవ్ర గాయాలు

వల్లూరు : మండలంలోని తప్పెట్ల వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని దుగ్గాయపల్లెలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పవన్ వ్యాస్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు తప్పెట్ల సమీపంలో పవన్ వ్యాస్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం, లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పవన్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం అతనిని 108 వాహనంలో కడప ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వేలూరు ఆసుపత్రికి తరలించారు.

మాజీ సైనికుడు.. వడ్డీ రాక్షసుడు!

- అప్పుతీసుకున్న మహిళలపై అసభ్య ఆరోపణలు
- లక్ష రూపాయల అప్పునకు ఆరునెలల్లో రెండు లక్షలు వసూలు
- మహిళల నుంచి బాండ్లు, చెక్కుల సేకరణ
- అప్పుతీరినా ఇవ్వకపోగా దబాయింపు
- పోలీసులను ఆశ్రయించిన బాధిత మహిళలు



ఏకాంబరరెడ్డి ఆగడాలపై స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు



అధిక వడ్డీల విషయమై మాట్లాడుతున్న సీఐ

మదనపల్లె : మదనపల్లెలో వడ్డీ వ్యాపారుల ఆగడాలు హద్దుమీరుతున్నాయి. మహిళలకు అధిక వడ్డీలకు అప్పులిచ్చి, ఇష్టారీతిన వసూళ్లకు పాల్పడుతున్నారు. అలస్యమైతే బెదిరించడం, తెలిసిన వారి వద్ద వారిపై అసభ్య ఆరోపణలు చేయడం, భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వేధింపులకు భయపడి ఎలాగోలా అష్టకష్టాలు పడి అప్పుతీర్చేసినా వారు ష్యూరిటీగా ఇచ్చిన బాండ్లు, చెక్కులు ఇవ్వకుండా, రెండేళ్ల తర్వాత తిరిగి అప్పు ఉన్నారని వేధించి, ప్లాట్లు, ఇంటిస్థలాలు రాయించుకున్న ఓ మాజీ సైనికోద్యోగి, వడ్డీ వ్యాపారిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మహిళలు ఫిర్యాదు చేశారు.

మదనపల్లె– తిరుపతిరోడ్డులోని దేవతానగర్‌కు చెందిన ఏకాంబరరెడ్డి మాజీ సైనికోద్యోగి. పట్టణంలో కొన్నేళ్లుగా ఇతను నిబంధనలకు వ్యతిరేకంగా అమాయకపు ప్రజల అవసరాలను తన ఆదాయ వనరులుగా మార్చుకుని, అధిక వడ్డీకి అప్పులు ఇస్తున్నాడు. గృహిణులు, చిరువ్యాపారులు, దినసరి కూలీలను లక్ష్యంగా చేసుకుని సాధారణం కంటే రెట్టింపు వడ్డీ వసూలుచేస్తున్నాడు. లక్ష రూపాయలు అప్పు ఇచ్చి, ఆరునెలల్లోనే రెండులక్షలు వసూలుచేస్తూ నిరుపేదల శ్రమను దోచేస్తున్నాడు. ఇతడి వడ్డీ వసూలు ఎలా ఉంటుందంటే... ఓ వ్యక్తికి రూ.10వేలు అవసరమైతే..ఏకాంబరరెడ్డి రూ.1,500 మినహాయించుకుని రూ.8,500 అప్పుగా ఇస్తాడు. వారంరోజుల తర్వాత అప్పు తీసుకున్న వ్యక్తి రూ.10వేలు చెల్లించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో రూ.1,500 వడ్డీ ఇవ్వాల్సి ఉంటుంది. రోజులు పెరిగితే అసలు, వడ్డీపై అపరాధం కట్టాల్సి ఉంటుంది. ఈ లెక్కన అవసరం ఉన్న పేదలు, మహిళలు వారి వారి అవసరాన్ని పట్టి ఏకాంబరరెడ్డి వద్ద రూ.10వేల నుంచి రూ.5లక్షల వరకు అప్పులు చేశారు. లక్షల్లో అప్పులు చేసిన వారు వడ్డీకి, చక్రవడ్డీలు చెల్లించలేక, తమ ఆస్తులను అతడికి ధారాదత్తం చేశారు. అప్పు చెల్లించినా కొంతమందికి ష్యూరిటీగా ఉంచుకున్న ఖాళీ చెక్కులను, బాండ్లు కోర్టులో వేసి, బాధితులకు లాయర్ నోటీసులు పంపి మానసికంగా హింసిస్తున్నాడు. ఇతడు పెట్టిన బాధలకు కొందరైతే ఏకంగా ఊరు వదిలి వెళ్లిపోయిన దాఖలాలు ఉన్నాయి. అప్పులు వసూలు చేసే క్రమంలో... మహిళలను పత్రికల్లో రాయలేని విధంగా, జుగుప్సాకరంగా మాట్లాడటమే కాకుండా, వారి వ్యక్తిగత జీవితాలపై అసభ్య ఆరోపణలు చేశాడు. ఏకాంబరరెడ్డి తమతో మాట్లాడిన మాటలను కాల్‌రికార్డ్ రూపంలో సేవ్ చేసి బాధితులు పోలీసులకు ఫిర్యాదు సమయంలో అందించారు. టూటౌన్ పోలీసులను మహిళలు ఆశ్రయించిన విషయం తెలుసుకున్న తక్షణమే, రాజీ చేసుకుందామని, మధ్యవర్తుల ద్వారా రెండురోజుల పాటు మంతనాలు జరిపాడు. ఏకాంబరరెడ్డి వడ్డీ ఆగడాలపై పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళల్లో...దేవతానగర్‌కు చెందిన గౌరి, సుజాత, రెడ్డీస్‌కాలనీకి చెందిన జి.భారతి, పి.నళిని, గోవిందనాయుడు వీధికి చెందిన నాగమణి, ఎస్టేట్‌కు చెందిన ఖాదర్‌వలీ తదితరులు ఉన్నారు. ఏకాంబరరెడ్డి వడ్డీ వసూళ్లపై సీఐ యువరాజు వివరణ ఇస్తూ...బాధితులు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని, బాధితుల ఫిర్యాదుమేరకు విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఇంకా ఎవరైనా ఏకాంబరరెడ్డి బాధితులు ఉంటే, టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజలు అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని, ఇబ్బందులు తెచ్చుకోవద్దని సూచించారు.

గ్రానైట్ క్వారీలో అనుమానాస్పద స్థితిలో కార్మికుడి మృతి

- మృతుడు రాజస్థాన్ వాసి
- క్వారీ యజమాని మృతునికి లక్షల్లో బకాయి ఉండడంతో మృతిపై అనుమానాలు
- గుండెపోటుతో చనిపోయాడని ఆస్పత్రికి తరలింపు
- తాలూకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



క్వారీలో మృతి చెందిన హుక్మరామ్

మదనపల్లె : గ్రానైట్ క్వారీలో గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లి మండలంలో జరిగింది. రాజస్థాన్ రాష్ట్రం, జగదీష్ పూర, బిహాదోకిదాని గ్రామానికి చెందిన నారాయణరామ్ కుమారుడు హుక్మరామ్ (44), గత 13 సంవత్సరాలుగా, మదనపల్లి మండలం బండకింద పల్లె వద్ద ఉన్న డీకే గ్రానైట్ మైన్స్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి10 గంటలకు హుక్మరామ్ అపస్మారక స్థితిలో బంధువులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రాత్రి 9 గంటలకు భోజనం అనంతరం ఉన్నట్టుండి ఒక్కసారిగా హుక్మ రామ్ కింద పడిపోయాడని, వెంటనే ఆసుపత్రికి తీసుకు వచ్చామని బంధువులు చెప్పారు. గుండెపోటుకు గురై మరణించాడని డాక్టర్లు చెప్పారని వివరించారు. అయితే మృతదేహం ముఖంపై గాయాలు ఉండడం, క్వారీ యజమాని వద్ద నుంచి రూ.16 లక్షలకు పైగా బకాయి రావాల్సి ఉండడం, తాను నివసిస్తున్న షెడ్డులోనే గాయాలతో పడి ఉండటం, పలు అనుమానాలకు తావిస్తోంది. హుక్మ రామ్ మృతి చెందిన అనంతరం తెల్లవారుజాము వరకు క్వారీ యజమానులకు, మృతుని బంధువులకు మధ్య మంతనాలు జరిగాయి. గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని తరలించే ప్రయత్నం చేశారు. చివరకు తెల్లవారుజామున మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. క్వారీలో పనిచేస్తున్న వారు యజమాని పేరు తమకు తెలియదని మేనేజర్ గోపి తమకు నగదు లావాదేవీలు జరిపేవాడని తెలిపారు. హుక్మ రామ్ గ్రానైట్ కటింగ్ ఒప్పంద పద్ధతిలో చేసేవాడని ఈ క్రమంలో పెద్ద మొత్తంలో యజమాని అతనికి బకాయి పడ్డాడని తెలిపారు. మృతుని సోదరుడు పోకోరాం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎస్ శేఖర్ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు



గాయపడిన వరుణ్‌కుమార్, వెంకటరమణ

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వాల్మీకిపురం మండలం దిగువబురుజుగడ్డకు చెందిన వెంకటరమణ కుమారుడు నాగరాజ(23) ద్విచక్రవాహనంలో వాల్మీకిపురానికి వస్తూ వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, స్థానికులు 108లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. అదేవిధంగా బుధవారం సాయంత్రం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు వరుణ్‌కుమార్(19), సుమన్(19), అరుణ్(19) ముగ్గురు కలిసి ద్విచక్రవాహనంలో కాలేజికి వెళుతుండగా, కనుమలో గంగమ్మ ఆలయం వద్ద స్థానికుడైన వెంకటరమణ(55) మరో ద్విచక్రవాహనంలో ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నారు. ప్రమాదంలో వరుణ్‌కుమార్, వెంకటరమణలు తీవ్రంగా గాయపడగా, సుమంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు.

టీడీపీ నుంచి భారీగా వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ, రామాపురం పంచాయతీల పరిధిలో పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కుటుంబాల వారు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డిలు ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం తరిగొండకు చెందిన టీడీపీ నాయకులు మహమ్మదాలీ, రామాపురం పంచాయతీ లక్కావాండ్లపల్లెకు చెందిన టీడీపీ నాయకులు చంద్రలతో పాటు మరో 50 కుటుంబాలకు చెందిన టీడీపీ సానుభూతి పరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, జగనన్న పథకాలను చూసి పలువురు పార్టీలోకి రావడం శుభపరిణామమన్నారు. పార్టీలో అందరు కష్టపడి పని చేసి రాబోయే ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, ఎల్వీరమణ, మాజీ ఎంపీపీలు జమీర్, తరిగొండ ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ యల్లారెడ్డి, నాయకులు సురేంద్రరెడ్డి, నరసింహారెడ్డి, రాజారెడ్డి, కొత్తపల్లె రాజన్న, రమణ, సయ్యద్‌సాబ్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

డాడీహోం రాజారెడ్డి ఆశయ సాధనకు కృషి

త్రిదండి చిన్నజీయర్ స్వామి



రాజారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న స్వామీజీ

ప్రొద్దుటూరు కల్చరల్ : సేవయే పరమావధిగా జీవించిన వ్యక్తి డాడీహోం వ్యవస్థాపకుడు రాజారెడ్డి అని త్రిదండి చిన్న జీయర్‌స్వామి కొనియాడారు. మండల పరిధిలోని పూజా ఇంటర్నేషనల్ స్కూల్‌లో బుధవారం రాజారెడ్డి సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్వామీజీ మాట్లాడుతూ రాజారెడ్డి అనాథలు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల సంక్షేమానికి, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎనలేని సేవ చేశారన్నారు. తాను అల్లంపల్లిలో ఏర్పాటు రెసిడెన్షియల్ పాఠశాలను రాజారెడ్డి సందర్శించి పూజాస్కూల్, రాజాఫౌండేషన్‌ను జీయర్ ట్రస్ట్ స్వాధీనం చేసుకోవాలని కోరారని అప్పట్లో దానికి తాను అంగీకరించలేదన్నారు. ఐఏఎస్ అధికారి కృష్ణబాబు పాఠశాలకు చెందిన కవిత, రాధలు కూడా స్వాధీనం చేసుకోవాలని కోరారన్నారు. రాజారెడ్డి కోరిక మేరకు రాజాఫౌండేషన్, పూజాస్కూల్ జీయర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవలందిస్తామన్నారు. రాజాఫౌండేషన్‌కు నూతన కమిటీని ఏర్పాటు చేశామని దీని ద్వారా సేవలందిస్తామన్నారు. రాజా ఫౌండేషన్ అధ్యక్షుడు బుశెట్టి రాం మోహన్‌రావు మాట్లాడుతూ స్వామి సూచన మేరకు కొత్తకమిటీని ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ చేశామన్నారు. కార్యదర్శి గొర్రె శ్రీనివాసులు మాట్లడారు. కార్యక్రమంలో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కోశాధికారి విశ్వచింతన్‌స్వామి, సభ్యురాలు కిరణ్మయి, రాజాఫౌండేషన్ సభ్యుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, పూజా పాఠశాల ప్రిన్సిపాల్ విల్సన్ జాన్, వైస్‌ప్రిన్సిపాల్ పరిమళ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

– ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తూ ఒకరు, ఆంధ్రప్రదేశ్ మద్యాన్ని నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తూ మరొకరు పట్టుబడినట్లు ఎస్ఈబీ సీఐ రమేష్ రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని చంద్ర కాలనీకి చెందిన నారాయణ నాయక్ కుమారుడు బుక్కే శంకర్ నాయక్ (37), కర్ణాటకకు చెందిన అమత్ సిల్వర్ కప్ విఎస్ఓబి విస్కీ టెట్రా ప్యాకెట్లను రవాణా చేస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి రూ. 1900 విలువగల 60 కర్ణాటక 90 ఎం.ఎల్ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. అదేవిధంగా పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న కోకిల బార్ అండ్ రెస్టారెంట్‌లో సర్వర్‌గా పని చేస్తున్న, నీరుగట్టువారిపల్లె, రామిరెడ్డి లేఔట్ కు చెందిన ఎం.జయప్ప నాయుడు (54), బార్ మూసి వేసిన సమయంలో అక్రమంగా ఆంధ్రప్రదేశ్ మద్యాన్ని విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి రూ.5660 విలువగల 42 బాటిల్స్‌ను డీటీఎఫ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామన్నారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ

రామాపురం : మండలంలోని చిట్లూరు పంచాయతీ మజ్జిగవాండ్లపల్లెకు చెందిన రైతులు రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అమరనాథ్ రెడ్డి, అయన కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డి మంగళవారం వ్యవసాయ పొలం పంపు సెట్టు వద్ద వంతుల విషయంలో ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో నలుగురికి గాయాలైనట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ శర్మ తెలిపారు. కాగా ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పరిహారం అందలేదని రైతు ఆత్మహత్యాయత్నం

మైదుకూరు : హైవే బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూమి కోల్పోయినా, పరిహారం అందలేదనే మనస్తాపంతో ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన బుధవారం మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు – బళ్లారి జాతీయ రహదారి బైపాస్ నిర్మాణంలో మున్సిపాలిటీ పరిధిలోని గడ్డంవారిపల్లె వద్ద కొట్టి చెంద్రాయుడు, ఆయన సోదరుల భూమిని ప్రభుత్వం సేకరించింది. మైదుకూరు – బద్వేలు రహదారిలోని ఈ భూమికి మంజూరైన పరిహారం అందలేదనే మనస్తాపంతో బుధవారం సాయంత్రం చెంద్రాయుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. పరిహారం చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని ఈ సందర్భంగా రైతు చెంద్రాయుడు ఆరోపించారు.

కుటుంబ సభ్యుల మధ్య వివాదం వల్లే...

చెంద్రాయుడు కుటుంబ సభ్యుల మధ్య భూముల భాగ పరిష్కారంలో తలెత్తిన వివాదం వల్లే వారికి బైపాస్ నిర్మాణంలో సేకరించిన భూమికి పరిహారం అందలేదని తహసీల్దార్ సురేంద్రనాథ్ రెడ్డి అన్నారు. చెంద్రాయుడు కుటుంబ సభ్యులైన ఏడుగురు అన్నదమ్ములు భూముల భాగపరిష్కారం విషయంలో కోర్టుకు వెళ్లారని ఆయన పేర్కొన్నారు. కోర్టులో వివాదం ఉన్నందున జాతీయ రహదారుల శాఖ సేకరించిన భూమికి సంబంధించి పరిహారం కోర్టులో డిపాజిట్ అయిందని తెలిపారు. చెంద్రాయుడు కుటుంబ సభ్యులకు సంబంధించి సర్వే నంబర్లు 1382లో 18 సెంట్లు, 1383లో 46 సెంట్లు, 1384లో 58 సెంట్లు, 1407లో 8 సెంట్లు జాతీయ రహదారుల శాఖ సేకరించినట్టు తహసీల్దార్ వివరించారు. బైపాస్ నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి పరిహారం మంజూరు కాకపోతే మంజూరు కోసం ప్రయత్నం చేయాలన్నారు. పరిహారం మంజూరైన తర్వాత రోడ్డు నిర్మాణం అడ్డుకునే హక్కు ఎవరికీ ఉండదన్నారు. అయితే చెంద్రాయుడు విషయంలో పరిహారం మంజూరైందని, కోర్టులో అన్నదమ్ముల మధ్య వివాదం పరిష్కారం కాగానే పరిహారం అందుతుందన్నారు.

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం



అక్రమ మద్యం బాటిళ్లు విక్రయిస్తూ పట్టుబడిన వ్యక్తితో ఎస్ఐ

వల్లూరు : మండల కేంద్రమైన వల్లూరులో బుధవారం 20 అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట రమణ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఎలాంటి అనుమతులు లేకుండా మద్యాన్ని విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రూ.1.20 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

నలుగురు అరెస్టు

మైదుకూరు : మైదుకూరులోని వీణా విజయరామరాజు కాలనీలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 12.100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మైదుకూరు డీఎస్పీ వెంకటేశులు బుధవారం విలేకరులకు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తన సూచనలతో అర్బన్ సీఐ ఏపీ మస్తాన్, ఎస్ఐలు రాజరాజేశ్వర్‌రెడ్డి, ఘన మద్దిలేటి, సిబ్బంది మంగళవారం సాయంత్రం వీణా విజయరామరాజు కాలనీకి చెందిన సాంబారావు వెంకటయ్య ఇంటి వద్ద దాడి చేసినట్టు డీఎస్పీ వివరించారు. దాడిలో కాలనీకి చెందిన సాంబారావు వెంకటయ్యతోపాటు మైదుకూరు మున్సిపాలిటీలోని గొల్లపల్లెకు చెందిన మాదెం సుస్మంత్ కుమార్, చెన్నూరు లక్ష్మీనగర్‌కు చెందిన గంధం సుబ్బరాయుడు, ప్రొద్దుటూరు శ్రీనివాసనగర్‌కు చెందిన మేకల సునీల్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1.20 లక్షల విలువైన నాలుగు ప్యాకెట్లలో ఉన్న ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ గంజాయి అక్రమ రవాణాలో మరో ఇద్దరు వ్యక్తులు కూడా ఉన్నారని, వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో అర్బన్ సీఐ మస్తాన్, ఎస్ఐలు రాజరాజేశ్వర్‌రెడ్డి, ఘన మద్దిలేటి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలి

ఎన్నికలు ముగిసే వరకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని డీఎస్పీ వెంకటేశులు అన్నారు. అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించరాదన్నారు.

ఈసీ ఆదేశాలను పట్టించుకోని టీడీపీ నేతలు

- అధికారులు హెచ్చరించినా సమావేశాలు నిర్వహించిన టీడీపీ అభ్యర్థి వరద
- కేసు నమోదులో అధికారులు వెనకడుగు



ప్రొద్దుటూర మండలం గోపవరం పంచాయతీలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో టీడీపీ నేతలు నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. తమ అనుమతి లేనిదే సభలు, సమావేశాలు నిర్వహించకూడదని ఎన్నికల కమిషన్ స్పష్టంగా ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 16వ తేదీన ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను ప్రకటించింది. అదే రోజు నుంచి ఎన్నికల కోడ్‌ను అమలు చేస్తూ నియమ నిబంధనలను పాటించాలని ఆదేశించింది. మరుసటి రోజు ప్రొద్దుటూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కౌసర్ బాను, అటు అధికారులతో, అన్ని రాజకీయ పార్టీలకు సమావేశాలే ఏర్పాటు చేసి నిబంధనలను పాటించాలని చెప్పారు.

కేసు నమోదుకు అధికారులు వెనకడుగు

ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘించి స్థానిక టీడీపీ నేతలు సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నా అధికారులు కేసులు నమోదు చేయడంలో వెనకడుగు వేస్తున్నారు. కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని టీచర్స్ కాలనీలో మంగళవారం సాయంత్రం టీచర్స్ కాలనీలో రియల్ ఎస్టేట్ వ్యాపారి కల్లూరు ప్రవీణ్ రెడ్డి, గంగిశెట్టి చక్రవర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి హాజరై ప్రసంగించారు. అనంతరం వారిని పార్టీలో చేర్చుకున్నారు. అలాగే గోపవరం గ్రామంలో బుధవారం ఉదయం గోలిపోతుల సుదర్శన్ ఏర్పాటు చేసిన సమావేశానికి వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్యతోపాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ రెండు సంఘటనలపై అధికారులు కనీసం ఫిర్యాదు చేయలేదు. ఈ కారణంగా కేసు నమోదు కాలేదు. బుధవారం ఉదయం 10 గంటలకు 22వ వార్డు కౌన్సిలర్ మహ్మద్‌గౌస్ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి వరదరాజులరెడ్డి హాజరై ప్రసంగించారు. విషయం తెలుసుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి హైమావతి సంఘటన స్థలానికి వెళ్లి ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని చెప్పినా పట్టించుకోలేదు. ఇది ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమం ఎన్నికల కోడ్‌కు సంబంధం లేదని అధికారితో టీడీపీ నేతలు వాగ్వాదానికి దిగారు. ఆమె ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు వరదరాజులరెడ్డితోపాటు మహ్మద్ గౌస్‌పై కేసు నమోదు చేశారు. అంతటితో ఆగకుండా వరద సాయంత్రం గోపవరం గ్రామ పంచాయతీలో పొట్టు లక్ష్మిరెడ్డి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశానికి సంబంధించి టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డితోపాటు పొట్టు లక్ష్మిరెడ్డిపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా సభ నిర్వహించారని ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి గాలిపోతుల సురేష్ చేసిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యేపై కేసు నమోదు

మున్సిపాలిటీలోని 38వ వార్డులో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి హైమావతి అనుమతి లేనిదే ప్రచారం చేయవద్దని తెలిపారు. వెంటనే ఎమ్మెల్యే ప్రచారాన్ని ఆపివేశారు. వెంటనే అధికారుల అనుమతి కోసం దరఖాస్తు చేసి బుధవారం నుంచి ఎన్నికల ప్రచారాన్ని యధావిధిగా ప్రారంభించారు. అయినా అధికారులు ముందు రోజు వార్డు కౌన్సిలర్ పల్లా రమాదేవి, ఆమె తనయుడు సురేష్‌పై కేసు నమోదు చేశారు. ఒత్తిళ్ల కారణంగా బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిపై కేసు నమోదు చేశారు. వివేకానంద కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశానికి సంబంధించి వైఎస్సార్‌సీపీకి చెందిన జంగమయ్య, సుబ్బారావుపై కేసు నమోదైంది. వారం రోజులు ముందుగా నూర్ బాషా దూదేకుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. కరపత్రాలు పంచి పెట్టారు. యధావిధిగా ఆదివారం సమావేశం నిర్వహించినందుకు నూర్ బాషా దూదేకుల సంఘం నాయకులు నాగూర్, పగిడాల దస్తగిరిపై కేసు నమోదు చేశారు. తమకు అవగాహన లేకపోవడం వల్లే అనుమతి తీసుకోలేదని ఈ సందర్భంగా వారు తెలిపారు.

వైవీయూ పరిశోధక విద్యార్థికి రూ.30 లక్షల ఫెలోషిప్



పరిశోధక విద్యార్థిని అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం జియాలజి శాఖ డీఎస్టీ ఇన్‌స్పైర్ ఫెలో పరిధిలో పీహెచ్‌డీ పూర్తిచేసిన డాక్టర్ బి. ప్రదీప్ కుమార్‌కి భారత ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ – సైన్స్ అండ్ ఇంజినీరింగ్ బోర్డు నేషనల్ ఫెలోషిప్ కింద పరిశోధన కోసం 30 లక్షల ఫెలోషిప్ మంజూరు చేశారు. క్లైమేట్ ఛేంజ్ ఇంపాక్ట్ ఆన్ ల్యాండ్ డీగ్రేడేషన్ అనే అంశం మీద నేషనల్ జియోలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సి.ఎస్.ఐ.ర్ శాస్త్రవేత్త డాక్టర్ సత్రం మార్గదర్శనంలో ఈయన పరిశోధనలు నిర్వహించనున్నారు. విశ్వవిద్యాలయంలో ఆచార్య. కె. రఘుబాబు మార్గదర్శకంలో ప్రదీప్ కుమార్ ఇదివరకే పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ ఆచార్య. కె. కృష్ణా రెడ్డి, జియాలజీ అధ్యాపక బృందం ప్రదీప్‌కుమార్‌ను అభినందించారు.